సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 16 । నవంబర్ । 2023



టమాట కిలో రూ.22
కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది. కనిష్టం రూ.12, సరాసరి రూ.16 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.



సైబర్ వల విసిరింది మహిళే!
ఎస్పీ పేరుతో ఏకంగా సీఐలనే టార్గెట్ చేసిన కోయంబత్తూరుకు చెందిన విజయలక్ష్మిని అనంతపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
8లో

గరిష్టం/కనిష్టం
32.2°/ 18.8°
జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. వేకువజామున చలితో పాటు మంచు కురుస్తోంది. ఆకాశం మేఘావృతమైంది. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

9న జాతీయ లోక్ అదాలత్



అనంతపురం: డిసెంబర్ 9న ఉమ్మడి జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ తెలిపారు. రెండు జిల్లాల్లోని అన్ని కోర్టులతో పాటు, అనంతపురం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న అన్ని రకాల కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న మోటార్ వాహనాల ప్రమాద కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, వినియోగదారుల ఫోరం, పంచాయతీ/ టాక్స్, ప్రీలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత కక్షిదారులందరూ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీన సూచించారు.

తహసీల్దార్ల ఆధ్వర్యంలోనే కుల గణన



మాట్లాడుతున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: ఆర్థిక, సామాజిక అసమానతలు రూపుమాపి, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కుల గణన జిల్లాలో ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని జాయింట్ కలెక్టర్ చేతన్ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కులగణనపై అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ...మండల నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించే తహసీల్దార్ ఆధ్వర్యంలోనే ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. కుల గణనలో వలంటీర్లను వినియోగించుకోకూడదన్నారు. సచివాలయ ఉద్యోగులు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి ప్రత్యేకంగా తయారు చేసిన యాప్‌లో పొందుపరచాలన్నారు. కుల గణన కోసం మండల, డివిజన్ స్థాయి సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రజల కులం, ఉప కులంతో పాటు పలు వివరాలను ప్రభుత్వం సేకరిస్తుందన్నారు. సర్వేలో సుమారు 20 అంశాలకు సంబంధించిన ప్రశ్నలతో నమూనా పత్రం రూపొందించినట్లు చెప్పారు. సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో జేఎన్టీయూ స్నాతకోత్సవం

అనంతపురం: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం (జేఎన్టీయూ–ఏ) స్నాతకోత్సవం డిసెంబర్‌లో నిర్వహించనున్నారు. వీసీ జింకా రంగజనార్దన అధ్యక్షతన బుధవారం యూనివర్సిటీలో పాలకమండలి సమావేశం జరిగింది. అందుబాటులో ఉన్న సభ్యులు నేరుగా, కొంత మంది వర్చువల్‌గా పాల్గొన్నారు. సమావేశంలో పలు అంశాలపై చర్చ జరిగింది. డిసెంబర్‌లో నిర్వహించే స్నాతకోత్సవంలో ప్రదానం చేయనున్న గౌరవ డాక్టరేట్‌కు సంబంధించి ముగ్గురు ప్రముఖుల పేర్లను పాలకమండలి ప్రతిపాదన చేసినట్లు తెలిసింది. గతంలో నిర్వహించిన సీఏఎస్ (కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం)కు పాలకమండలి ఆమోద ముద్ర వేసింది. తాజాగా నిర్వహించిన సీఏఎస్‌కు పాలకమండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు హరిశ్చంద్రరామ, ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి, రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ పాల్గొన్నారు.



గిరగిరా తిరగాలి ఫ్యాను: బస్సుపైనుంచి అభివాదం చేస్తున్న దీపిక, ఫ్యాన్ గుర్తు చూపుతున్న మంత్రి ఉషశ్రీ



జనసాగరం: హిందూపురంలో సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభకు విచ్చేసిన అశేష జనవాహినిలో ఓ భాగం

'పురం'.. చైతన్య పథం

బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు... బ్యాక్‌బోన్ క్లాస్ అంటూ పట్టం కట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మద్దతు తెలిపేందుకు బడుగులంతా తరలివచ్చారు. మైనార్టీ కాదు...పాలనలో మెజార్టీ అంటూ పదవులు కట్టబెట్టిన జగనన్నకు కృతజ్ఞత తెలిపేందుకు ముస్లిం, క్రిస్టియన్‌లంతా 'పురం'లో కవాతు చేశారు. ఇన్నాళ్లూ ఓటర్లుగానే ఉన్న తమకు పదవులిచ్చిన జననేత వెంటే తామంతా అంటూ ఎస్సీ, ఎస్టీలంతా ముక్తకంఠంతో నినదించారు. అంతా ఏకమై.. తామంతా జగనన్న వెంటేనంటూ హిందూపురంలో వైఎస్సార్ సీపీ నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర సాక్షిగా సగర్వంగా చాటిచెప్పారు.

- హిందూపురంలో సామాజిక సాధికార బస్సు యాత్రకు జన ప్రవాహం
- భారీగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు తెలిపిన జనం
- చప్పట్లు చరుస్తూ...ఈలలు వేస్తూ ఉత్సాహం చూపిన అభిమానులు
- సభ విజయవంతంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం
- 'పురం' నుంచి 'వై నాట్ 175'కు శ్రీకారం
- సభలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మంత్రులు గుమ్మనూరు, ఉషశ్రీ
- ఎంపీలు ఆర్.కృష్ణయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ హాజరు



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, చిత్రంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పురం సమన్వయకర్త టీఎన్ దీపిక, ఏడీసీసీ చైర్‌పర్సన్ లిఖిత, నదీం అహ్మద్, మీసాల రంగన్న, పైలా నరసింహయ్య తదితరులు

సాక్షి, పుట్టపర్తి

నాలుగున్నరేళ్ల కాలంలో బడుగు, బలహీన వర్గాలకు చేసిన మేలును వివరించేందుకు బుధవారం వైఎస్సార్ సీపీ హిందూపురంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతమైంది. వైఎస్సార్ సీపీ రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతృత్వంలో, పురం సమన్వయకర్త టీఎన్ దీపిక పర్యవేక్షణలో అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించిన సభకు జనం జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. పథకాలతో లబ్ధిపొందిన వారితో పాటు అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలిరాగా 'పురం' జగన్ అభిమాన తరంగాన్ని తలపించింది. నేతల ప్రసంగాలు ఉత్తేజ పరచగా, జనం ఈలలు, చప్పట్లతో మద్దతు తెలిపారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో పలువురు నేతలు మాట్లాడారు.

హిందూపురం నుంచి 'వై నాట్ 175'కు శ్రీకారం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించిన 'వై నాట్ 175'కు హిందూపురం నుంచే శ్రీకారం చుడదామని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మంత్రులు గుమ్మనూరు జయరాం, ఉషశ్రీచరణ్ అన్నారు. టీడీపీని చిత్తుచిత్తుగా ఓడించి.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి.. జగనన్నకు బహుమానంగా ఇద్దామని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ బుట్టా రేణుక మాట్లాడుతూ...వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల కోసం ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. విద్యా వ్యవస్థలో మార్పులు తెచ్చి.. గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చిన జగన్‌ను మరోసారి సీఎం చేద్దామని పిలుపునిచ్చారు. సభలో ఎంపీలు ఆర్.కృష్ణయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు డాక్టర్ తిప్పేస్వామి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, వక్కళిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, హిందూపురం మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి, పామిడి వీరా, చందనశివాజీ, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌తోనే సామాజిక సాధికారత సాకారం

- డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

హిందూపురం: రాష్ట్రంలో సామాజిక సాధికారత సాకారం చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా అన్నారు. బుధవారం మధ్యాహ్నం హిందూపురంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన మేధావుల సదస్సు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఏ విధంగా మేలు చేశామని వివరించే బాధ్యత ప్రజాప్రతినిధులకు సీఎం అప్పజెప్పారన్నారు. గతంలో ఏ సీఎం కూడా ఇలాంటి కార్యక్రమం చేపట్టిన దాఖలాలు లేవన్నారు. మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. 'నవరత్నాలు' అమలులో భాగంగా ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే అన్నారు. శంకరనారాయణ మాట్లాడుతూ.. మేధావుల సదస్సులో తెలియపరిచిన సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

జీవితాల్లో మార్పు తెచ్చిన జగన్



సీఎం వైఎస్ జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చారు. ఉన్నత చదువులకు సహకారం అందించి.. రాజకీయంగాపైకి తీసుకొచ్చారు. పంచాయతీ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజ్యాధికారం కట్టబెట్టిన ఘనత ఒక్క జగన్‌దే. పలు సంక్షేమ పథకాల ద్వారా పేదల కుటుంబాల్లో వెలుగులు నింపిన ఏకైక నేత జగన్ మాత్రమే. రాజకీయంగా ఎదురు లేని మనిషి. మాట తప్పని నేత, ఢిల్లీ పెద్దలను ఢీకొట్టిన మొనగాడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు ఎంతో గౌరవం దక్కుతోంది. పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా అన్నింటా మహిళా ప్రాధాన్యం పెరిగింది.

– గోరంట్ల మాధవ్, ఎంపీ, హిందూపురం

బాలయ్యను సాగనంపుదాం



నియోజకవర్గానికి చుట్టపు చూపుగా వచ్చే బాలకృష్ణను శాశ్వతంగా హైదరాబాద్‌కే సాగనంపుదాం. ప్రజా సమస్యలు పట్టించుకోని ఆ వ్యక్తి మన ప్రతినిధా? ఏనాడూ నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడిన దాఖలాలు లేవు. షూటింగుల్లో బిజీగా ఉండే బాలయ్యను చిత్తుగా ఓడిద్దాం. వైఎస్ జగన్ సంకల్పించిన 'వై నాట్ 175'కు హిందూపురం నుంచి శ్రీకారం చుడదాం. హిందూపురం కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి జగనన్నకు బహుమానంగా ఇద్దాం.

– టీఎన్ దీపిక, వైఎస్సార్ సీపీ 'పురం' సమన్వయకర్త

టీడీపీలో అగ్రవర్ణాలదే పెత్తనం



టీడీపీలో అగ్రవర్ణాలదే పెత్తనం. ఎస్సీ రిజర్వుడు స్థానం మడకశిరలో ఈరన్నను కాదని.. కమ్మ కులానికి ఊడిగం చేస్తున్న గుండుమల తిప్పేస్వామికి టీడీపీ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చారు. చంద్రబాబు అంటేనే మోసం. టీడీపీ చేస్తున్న కుల రాజకీయాలను ప్రతి ఒక్కరూ గమనించాలి. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి టీడీపీ వారికి బుద్ధి చెప్పాలి. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఇక్కడికి చుట్టపుచూపుగా వస్తాడు.. ముగ్గురిని తిడతాడు.. ఇద్దరిని కొడతాడు. మళ్లీ ఆర్నెల్లవరకూ కనిపించడు. అలాంటి వ్యక్తికి ఈసారి కర్రుకాల్చి వాతపెట్టాలి.

– తిప్పేస్వామి, ఎమ్మెల్యే, మడకశిర

జగన్‌తోనే సాధికారత



ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ సీఎం అయ్యాకే.. బీసీలకు రాజ్యాధికారం దక్కింది. గత పాలకులు బీసీలను ఓటర్లుగా వాడుకున్నారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ బీసీలను పాలకులుగా గుర్తించి రాజ్యాధికారం కట్టబెట్టారు. ఇలాంటి సీఎం ఉంటేనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉంటారు. మహిళలకు పెద్దపీట వేస్తూ ఎన్నో నామినేటెడ్ పదవులు కట్టబెట్టారు. మహిళలంతా ఆయనకు మద్దతుగా నిలవాలి.

– బోయ గిరిజమ్మ, చైర్‌పర్సన్, జిల్లా పరిషత్



అన్నకు మద్దతు: జగన్ చిత్రాలతో కూడిన పోస్టర్లతో మహిళలు



హమ్ జగన్ కే సాత్‌హై: ర్యాలీగా సభకు వచ్చిన ముస్లింలు



జన తరంగం: సభకు తరలివచ్చిన అభిమానులు



ఉరకలెత్తిన ఉత్సాహం: సాధికార సభలో డప్పులమోత

దేవరపల్లిలో మౌలిక వసతులన్నీ కల్పిస్తాం



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, వేదికపై సబ్ కలెక్టర్ కార్తీక్




ప్రజాభిప్రాయ సేకరణ సభలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని దేవరపల్లి గ్రామంలో మౌలిక వసతులన్నీ కల్పిస్తామని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఎంఎస్ బిల్లెట్లు, టీఎంటీ బార్ తయారీ పరిశ్రమ విస్తరణ నేపథ్యంలో బుధవారం ఆయన దేవరపల్లి గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) ఫండ్‌తో గ్రామంలో మౌలిక వసతులతో పాటు వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగు పరచడంతో పాటు అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అలాగే పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం ఉండేలా చూస్తామన్నారు. స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో పాటు చుట్టు పక్కల గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇందుకు అనుగుణంగా కాలుష్యనియంత్రణ మండలి అధికారులు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 'మిస్టర్ శామ్ ఫెర్రస్ లిమిటెడ్'తో పాటు సర్వే నంబర్ 67–2, 68–2లోని 13.17 ఎకరాల్లో పరిశ్రమల విస్తరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. పరిశ్రమల వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు స్థానికులు కూడా సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ వెంట పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ కిశోర్‌రెడ్డి, ఏఈఈ కృష్ణారెడ్డి, తహసీల్దార్ స్వర్ణలత, గ్రామస్తులు ఉన్నారు.

పోరాట యోధుడు బిర్సా ముండా

- 'జన జాతీయ గౌరవ దివస్'లో జేసీ చేతన్



గిరిజన వృద్ధులను సత్కరిస్తున్న జేసీ చేతన్, అధికారులు

పుట్టపర్తి అర్బన్: బ్రిటీషర్ల వలసవాదాన్ని ఎదుర్కొని దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించడంతోపాటు గిరిజన తెగల ప్రజల్లో రాజకీయ చైతన్యం నింపిన వ్యక్తి బిర్సా ముండా అని జాయింట్ కలెక్టర్ చేతన్ కొనియాడారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో 'జన జాతీయ గౌరవ దివస్'ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన యోధుడు బిర్సా ముండా అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన, షెడ్యూల్డ్ తెగల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, ప్రతి గిరిజన కుటుంబం సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా నవంబర్ 15న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల స్మారకార్థం 'జన జాతీయ గౌరవ దివస్'ను జరుపుకుంటున్నామన్నారు. గిరిజనులు తమ పూర్వీకుల నుంచి అందిపుచ్చుకున్న వారసత్వ సంపద, సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. అలాగే గిరిజనులంతా తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. ఈ సందర్భంగా గిరిజన పెద్దలు రామా నాయక్, కృష్ణా నాయక్‌ను జేసీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రాం, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిరుపాల్‌నాయక్, నాయకులు సాంబశివుడు, యశోదమ్మ, శివకుమార్, దుర్గాప్రసాద్, ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

‘పురం’ అభివృద్ధికి పట్టం కట్టండి




సదస్సులో మాట్లాడుతున్న శంకరనారాయణ (చిత్రంలో) డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీలు గోరంట్ల మాధవ్, కృష్ణయ్య, హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, మాజీ ఎంపీ బుట్టా రేణుక, సదస్సుకు హాజరైన మేధావులు, ప్రముఖులు



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

- ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం
- ‘పురం’ను అభివృద్ధి బాటలో నడిపిస్తాం
- మేధావుల సదస్సులో శంకరనారాయణ

హిందూపురం: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి పురం సమగ్రాభివృద్ధికి పట్టం కట్టాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ పిలుపునిచ్చారు. హిందూపురంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం మేధావుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథులుగా డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీ గోరంట్ల మాధవ్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకరనారాయణ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నివేదిక రూపొందించి ఇస్తే, దానిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. హిందూపురాన్ని అభివృద్ధి బాటలో నడిపించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సామాజిక సాధికారతలో భాగంగా పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం నియోజకవర్గంలోని సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై మేధావులు పలు సూచనలు చేశారు.

వైఎస్ మేలు మరవలేం



మైనార్టీల సంక్షేమానికి కృషి చేసిన దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మేలు మరువలేం. 4 శాతం రిజర్వేషన్ కల్పించినందుకు రుణపడి ఉన్నాం. హిందూపురం విషయానికి వస్తే జామియా మసీదు నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని గతంలో సీఎం చెప్పారు. ఈ నిధులు కేటాయించి నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నాం. మైనార్టీ పిల్లల చదువులకు జామియా మసీదుల్లోని స్కూళ్లను అభివృద్ధి చేయాలి.

– నూరుల్లా, జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు, హిందూపురం

వాల్మీకి పీఠం ఏర్పాటు చేయాలి



గుత్తి ప్రాంతంలో వాల్మీకి గుహలను అభివృద్ధి చేస్తుండడం చాలా సంతోషం. గుహలను అభివృద్ధి చేశాక అక్కడ వాల్మీకి పీఠం ఏర్పాటుకు అన్ని విధాలుగా సహకరించాలి. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాలో జనాభా ప్రాతిపదికన వాల్మీకులకు రాజకీయ పదవులు కేటాయించాలి. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై చొరవ తీసుకోవాలి.

– వాల్మీకి ఈశ్వరయ్య, పెనుకొండ

జిల్లా కోర్టు ఏర్పాటు చేయండి



పార్లమెంటు కేంద్రంగా ఉన్న హిందూపురం లో జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. ఇక్కడ అందరూ సమన్వయంతో పని చేస్తే వైఎస్సార్‌సీపీ గెలుపు సులువవుతుంది. హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీకి బలమైన ఓటు బ్యాంక్ ఉంది. అభిమానులూ ఉన్నారు. కార్యకర్తలు సైతం ఉత్సాహంతో పని చేస్తున్నారు.

– రామచంద్రారెడ్డి, న్యాయవాది, హిందూపురం

క్లుప్తంగా

17 నుంచి అండర్-19 క్రికెట్ టోర్నీ



ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

అనంతపురం: బీసీసీఐ కుచ్‌బెహర్ ట్రోఫీ నేపథ్యంలో ఈ నెల 17 నుంచి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జట్ల మధ్య అండర్ 19 క్రికెట్ మ్యాచ్‌లు అనంత క్రీడాగ్రామంలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రా జట్టు క్రీడాకారులు ఆర్డీటీ స్టేడియానికి చేరుకున్నారు. ఆంధ్రా జట్టు హెడ్ కోచ్ పి.మధుసూదన్‌రెడ్డి, తమిళనాడు హెడ్ కోచ్ అమర్‌నాథ్ పర్యవేక్షణలో బుధవారం ఇరు జట్లు ముమ్మర సాధన చేశాయి. నాలుగు రోజుల మల్టీడే మ్యాచ్‌ను వీక్షించేందుకు ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం కల్పించారు. మ్యాచ్ రెఫరీగా బాలకృష్ణ ముస్కిన్, అంపైర్లుగా అక్షయ్ మరాఠే, భరద్వాజ్, నాగేశ్వరరావును బీసీసీఐ నియామకం చేసింది.

104 వైద్య సేవల పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ

కొత్తచెరువు: స్థానిక విజయనగర కాలనీలో 104 వాహనం ద్వారా బుధవారం అందిస్తున్న వైద్య సేవలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 104 వాహనం ద్వారా వైద్య సేవలను ఇంటి వద్దనే అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

‘సైబర్’ వలను ఛేదించిన పోలీసులు

- కోయంబత్తూరు మహిళ అరెస్టు
- సులువుగా సంపాదించాలని సైబర్ బాట
- పోలీసుల విచారణలో ఒప్పుకున్న నిందితురాలు



కోయంబత్తూరుకు చెందిన మహిళను అదుపులోకి తీసుకున్న దృశ్యం

అనంతపురం క్రైం: పోలీసు శాఖను లక్ష్యంగా చేసుకుని విసిరిన ‘సైబర్’ వలను అనంతపురం పోలీసులు ఛేదించారు. సూత్రధారి తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన మహిళని గుర్తించి, అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎస్పీ అన్బురాజన్ ఫొటో ప్రొఫైల్‌గా ఉన్న వాట్సాప్ నుంచి ఇటీవల అనంతపురం వన్‌టౌన్, టూటౌన్, రూరల్, ఇటుకలపల్లి సీఐలకు చాటింగ్ చేశారు. ‘అర్జెంట్ పనిమీద ఉన్నాను. కొంత డబ్బు పంపించండి’ అని ఆ చాటింగ్ సారాంశం. ఈ నంబరు ఎస్పీది కాదని నిర్ధారణకు వచ్చిన తర్వాత వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ‘సైబర్’ వలను ఛేదించాలన్న ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక పోలీసు బృందం రంగంలోకి దిగింది. దర్యాప్తులో భాగంగా ఫేక్ కాల్, మెసేజ్ వచ్చిన ఫోన్ నంబర్ తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందినదిగా గుర్తించారు. వెంటనే వన్‌టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం కోయంబత్తూరుకు వెళ్లి సైబర్ నేరానికి యత్నించిన విజయలక్ష్మి అనే మహిళను అనంతపురం తీసుకొచ్చి విచారణ అనంతరం అరెస్టు చేశారు. సులువుగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో సైబర్ నేరాల వైపు పయనించినట్లు విజయలక్ష్మి పోలీసుల విచారణలో వెల్లడించారు.

శతాధిక వృద్ధుడి మృతి



అంజినప్ప (ఫైల్)

రొద్దం: మండలంలోని బీదానిపల్లికి చెందిన తూర్పువాకిలి కురుబ అంజినప్ప(115) బుధవారం మృతి చెందాడు. 1908లో జన్మించిన ఆయన చివరి క్షణం వరకూ ఎంతో ఆరోగ్యంగా ఉండేవారని, తన పనులు తానే చేసుకునేవాడని ఈ సందర్భంగా గ్రామస్తులు గుర్తు చేశారు.

ఆన్‌సెట్ సీఈఓ బాధ్యతల స్వీకరణ

అనంతపురం కల్చరల్: ఆన్‌సెట్ సీఈఓగా ఎస్.కరుణకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఆర్డీఓగా విధులు నిర్వర్తిస్తున్న ఆమెను ఇటీవల అనంతపురం ఆన్‌సెట్ సీఈఓగా అదనపు బాధ్యతలిచ్చిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం ఉదయం యువజన సంక్షేమ శాఖ కార్యాలయానికి చేరుకున్న ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పశువులకూ గుర్తింపు కార్డులివ్వండి



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ డీడీ సత్యప్రకాష్

పెనుకొండ: పశువులకూ గుర్తింపు కార్డులు జారీ చేయాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆ శాఖ డీడీ సత్యప్రకాష్ ఆదేశించారు. పశువులకు గుర్తింపు కార్డుల జారీ అంశంపై స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో బుధవారం డివిజన్ స్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రతి ఇంటినీ అధికారులు సందర్శించి, పశువులను గుర్తించాలన్నారు. గుర్తింపు కార్డుల జారీలో చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు.

చీటీల పేరుతో టీచరు కుచ్చుటోపీ

- సస్పెండ్ చేసిన అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి



రమేష్

అనంతపురం ఎడ్యుకేషన్: చీటీల పేరుతో రూ.కోట్లలో కుచ్చుటోపీ పెట్టి కటకటాలపాలైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమేష్‌ను అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి సస్పెండ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఉరవకొండ మండలం చాబాల గ్రామానికి చెందిన రమేష్ రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయలాజికల్ సైన్స్ టీచరుగా పని చేస్తున్నాడు. ఈయన అదనపు సంపాదన కోసం చీటీలు (చిట్స్) నడిపేవాడు. తోటి ఉపాధ్యాయులు, కూలీలు, వ్యాపారులు తదితర వందలాది మంది పరిచయస్తులతో చీటీలు వేయించాడు. అయితే కొంతకాలంగా చీటీలు ఎత్తిన వారికి డబ్బు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. గట్టిగా నిలదీసిన వారికి వడ్డీ ఇస్తానంటూ బుజ్జగించాడు. అలా ఒక్కొక్కరికి నుంచి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా బకాయి పెట్టాడు. ఆగస్టు 31 వరకు పాఠశాలకు వెళ్లాడు. సెప్టెంబరు 1 నుంచి అక్టోబరు 13 వరకు సెలవులోకి వెళ్లిపోయాడు. 14 నుంచి విధులకు హాజరు కాలేదు. హెచ్‌ఎం నోటీసు జారీ చేసినా స్పందన లేదు. చీటీలు ఎత్తిన తర్వాత డబ్బు ఇవ్వకుండా ముఖం చాటేయడంతో బాధితులు మాచర్ల రాజు, రామకృష్ణారెడ్డి, నరసింహులు, గంగిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు గత నెల 16న ‘స్పందన’లో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు అనంతపురం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడు నేరుగా కోర్టులో లొంగిపోవడంతో మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు. రిమాండ్ రిపోర్ట్ ఆధారంగా టీచరు రమేష్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు ఉత్తర్వులు జారీ చేశారు.

‘అనంత’ అధ్యాపకుడికి అంతర్జాతీయ అవార్డు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎస్.ఓబిరెడ్డి అంతర్జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. 110 దేశాల భాగస్వామ్యంతో ఏకేఎస్ గ్లోబల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏటా న్యూఢిల్లీ వేదికగా గ్లోబల్ టీచర్ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహిస్తుంటారు. ఈ ఏడాదికి సంబంధించి ఈ నెల 4న అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఇందులో ముఖ్య అతిథుల చేతుల మీదుగా ‘గ్లోబల్ టీచర్ అవార్డు’ను ఓబిరెడ్డి అందుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కళాశాలకు చేరుకున్న ఆయనను ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రాజు, కరస్పాండెంట్ పీఎల్ఎన్ రెడ్డి తదితరులు అభినందించారు. కళాశాల ప్రెసిడెంట్ పీవీ రమణారెడ్డి, కార్యదర్శి డాక్టర్ కె.నిర్మలమ్మ, వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు, ఈసీ సభ్యులు గోపి, ఎర్రిస్వామి, రవీంద్ర, డాక్టర్ రసూల్, ఫిరోజ్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.